

ఆస్పత్రి నుంచి ప్రొఫెసర్ డిశ్చార్జి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థి దాడి ఘటనలో గాయపడిన ప్రొఫెసర్ గోపాలరాజు మంగళవారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. తనను సెమిస్టర్ పరీక్ష రాసేందుకు అనుమతించలేదనే కోపంతో ఎంటెక్ ఫస్టియర్ విద్యార్థి మజ్జి వినయ్ పురుషోత్తం చాకుతో ప్రొఫెసర్ గోపాలరాజుపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భుజంపై, చేతిపై గాయాలైన గోపాలరాజును విద్యార్థులు, ట్రిపుల్ ఐటి సిబ్బంది హుటాహుటీన నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గోపాలరాజు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో మంగళవారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అయితే వైద్యులు రెండు వారాలు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇక దాడి కేసులో అరెస్టు అయిన విద్యార్థి వినయ్ పురుషోత్తంను కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

గిరిజనులను ముంచి

భూస్వాములకు పంచి..!

పోలవరం ఆర్అండ్ఆర్ భూసేకరణలో భారీ అవకతవకలు

ఎల్‌టిఆర్ భూములుగా కోర్టు తీర్పులిచ్చినా భూసేకరణ జాబితాలో చేరిక

గిరిజనేతర భూస్వాములకు మేలు చేసేందుకు రెవెన్యూ అధికారులు తహతహ


రెడ్డిగణపవరం రెవెన్యూ పరిధిలోని భూములకు వేరే పీసా కమిటీతో తీర్మానాలు

అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆర్‌డిఒ, తహశీల్దార్‌పై ఆరోపణలు

పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం గ్రామంలో సర్వే నెంబర్ 288లో 24.06 ఎకరాలను ఎల్‌టిఆర్ భూములుగా నిర్ధారిస్తూ 2018లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఆ భూములను కొనుగోలు చేయడానికి వీల్లేదని చెప్పింది. గిరిజనేతర భూస్వాముల పేరున ఆ మొత్తం భూములను ఇప్పుడు ఆర్అండ్ఆర్ భూసేకరణ జాబితాలో అధికారులు చేర్చేశారు.

రెడ్డిగణపవరం గ్రామంలో 347-1 సర్వే నెంబర్‌లో 1.47 ఎకరాలు, సర్వే నెంబర్ 480-2బి 2లో 1.92 ఎకరాలకు చెందిన భూములకు సంబంధించి గిరిజనులకు పట్టాలు ఉండటంతోపాటు వారే సాగులో ఉన్నారు. ఆర్అండ్ఆర్ భూసేకరణ మొదటి జాబితాలో ఈ భూములను పెట్టారు. దీనిపై అక్కడి ప్రజలు అభ్యంతరం చెప్పడంతో తొలగించి మళ్లీ రెడ్డిగణపవరం పంచాయతీ పరిధిలోని బెడదనూరు పీసా కమిటీ ద్వారా అడ్డగోలుగా తీర్మానాలు చేయించేశారు.



THE HON'BLE SRI JUSTICE P. NAVEEN RAO

WRIT PETITION No.39800 OF 2018

ORDER:

Heard.

2. Land acquisition proceedings are set in motion for acquiring lands for Chintalapudi Lift Irrigation Scheme. On 24.08.2018, notification under Section 21 of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013 was issued calling upon all the interested persons to file objections on the proposed decision of the Government to take possession of the land and to settle the claims of compensation/rehabilitation. Pursuant to the notification, petitioner claimed to have filed objections before the competent authority contending that names of persons against whom the land to an extent of Acs.24.06 cents in Survey No.288/1A1 of Reddyganapavaram Village, Buttaigudem Mandal, are non-tribals and are not entitled to receive compensation and in fact L.T.R. case is pending before the agent to Government against the claim of ownership by the unofficial respondents, whose names are reflected in the land acquisition proceedings. Alleging inaction on the objections filed by petitioner and that the respondents are taking steps to pay compensation to the ineligible persons, this Writ Petition is filed.

3. Learned Government Pleader for Land Acquisition stated that so far no orders are passed pursuant to the notification, dated

288 సర్వేనెంబర్‌లో ఉన్న 24.06 ఎకరాలను ఎల్‌టిఆర్ భూములుగా నిర్ధారించి కోర్టు ఇచ్చిన తీర్పు కాపీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


పైన పేర్కొన్న సర్వే నెంబర్లలో భూములే కాదు.. గిరిజనులకు సంబంధించిన వందల ఎకరాల భూములను ఈ విధంగా పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ భూసేకరణలో చేర్చి రెవెన్యూ అధికారులు తీవ్ర అవతకతవకలకు పాల్పడుతున్న పరిస్థితి ఉంది. పోలవరం ప్రాజెక్టుతో నిర్వాసితులవుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విఆర్‌పురం, కూనవరం మండలాల్లోని 36 గ్రామాల ప్రజలను తరలించేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 7,100 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం పూనుకుంది. దీనిలో 6,700 ఎకరాలు భూమికి భూమి కింద, మరో 400 ఎకరాలు కాలనీల నిర్మాణానికి అవసరమని అధికారులు చెబుతున్నారు. ఏజెన్సీలో గిరిజనులకు సంబంధించిన భూములను సేకరించడానికి చట్టాలు అంగీకరించవు. గిరిజనేతరుల భూములను మాత్రమే సేకరించాలి. దీంతో అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై, గిరిజనులకు సంబంధించినవి, ఎల్‌టిఆర్ భూములను గిరిజనేతరులకు చెందిన భూస్వాముల భూములుగా చూపిస్తూ జాబితాలో చేరుస్తున్న పరిస్థితి ఉంది. ఎకరాకు రూ.15 లక్షల వరకూ ప్రభుత్వం పరిహారం ఇస్తోంది. దీంతో రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకులు గూడుపుఠాణికి దిగారు. గిరిజనులకు చెందిన భూములను గిరిజనేతరులవిగా చూపిస్తూ పరిహారం సొమ్ము దోచుకునేందుకు సిద్ధమయ్యారు. దీని కోసం ప్రత్యేకంగా నలుగురైదుగురు దళారులు అధికారులతో కలిసి నిత్యం పని చేస్తున్నారు.

తప్పుడు పద్ధతిలో పీసా కమిటీ తీర్మానాలు

ఏజెన్సీ ప్రాంతంలో భూసేకరణ చేయాలంటే గ్రామసభ తీర్మానం తప్పనిసరి. ఆయా గ్రామాల్లో సేకరిస్తున్న భూములకు సంబంధించిన గ్రామసభ నిర్వహించి తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. గిరిజనుల భూములను వేరే వారి పేరున జాబితాలో పెట్టడంతో రెడ్డిగణపవరం వంటి గ్రామాల్లో ప్రజలు అభ్యంతరాలు చెప్పారు. దీంతో వాటిని తొలగిస్తున్నట్లు చెప్పి నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ జగ్గిశెట్టిగూడెం రెవెన్యూ పీసా కమిటీతో తీర్మానాలు చేయించిన పరిస్థితి ఉంది. రెడ్డిగణపవరం రెవెన్యూ భూములను జగ్గిశెట్టిగూడెం పీసా కమిటీతో ఎలా తీర్మానం చేయిస్తారో అర్థం కాని పరిస్థితి ఉంది. ఇలా ఒకటి, రెండు కాదు.. వందల ఎకరాలకు సంబంధించి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా మూడెకరాలు భూమి ఉంటే నాలుగెకరాలు ఉన్నట్లు నోటిఫికేషన్‌లో పెడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదనంగా వచ్చే సొమ్మును పంచుకునేందుకు అంతా గూడుపుఠాణి పన్నినట్లు తెలుస్తోంది. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఆర్అండ్ఆర్ భూసేకరణలో భారీ అవకతవకలు జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు ఉండటం లేదు. గిరిజనులకు తీరని అన్యాయం చేస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు నుంచి సైతం సరైన స్పందన లేకుండాపోయింది. ఆర్‌డిఒ, తహశీలార్లపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజనులకు సంబంధించిన భూములను గిరిజనేతర భూస్వాములవిగా పేర్కొంటూ రూ.వందల కోట్ల అవినీతికి పాల్పడుతున్న పరిస్థితి ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

యుద్ధప్రాతిపదికన అందిస్తామని జెడి హామీతో ఆందోళన విరమణ



ప్రగడపల్లి సెంటర్‌లో రోడ్డుపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రగడపల్లి గ్రామంలో రైతులు యూరియా కోసం మంగళవారం రోడ్డెక్కారు. యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రగడపల్లి మెయిన్ సెంటర్‌లో రైతులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిరసన తెలిపారు. పోలవరం నుంచి కన్నాపురం వెళ్లే రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ విషయం తెలియగానే పోలవరం ఎఒ కె.రాంబాబు వెంటనే అక్కడికి చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా ప్రగడపల్లి చేరుకుని రైతులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం నుంచి 50 టన్నుల యూరియా మధ్యాహ్నం బయల్దేరిందని, అది రాగానే రైతులకు అందజేస్తారని తెలిపారు. సొసైటీ వద్ద పగటి వేళల్లో రైతులు ఇబ్బంది పడకుండా టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని తహశీల్దార్ బి.సాయిరాజుకు సూచించారు. దీంతో రైతులు శాంతించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఎడి బుజ్జిబాబు, ఎఒ తదితరులు ఉన్నారు.

'మిషన్ వాత్సల్య'లో మంచి ఫలితాలు సాధించాలి

దత్తత స్వీకరణ నిబంధనల మేరకు జరగాలి: కలెక్టర్



ప్రజాశక్తి - ఏలూరు


మిషన్ వాత్సల్య పథకం అమలుకు మరింత సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలను సాధించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా బాలల సంక్షేమం, రక్షణ కమిటీపై కన్వర్జెన్స్ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురైన బాలలకు రక్షణ కల్పించి వారికి మిషన్ వాత్సల్య కార్యక్రమం ద్వారా విద్య, ఆరోగ్యం తదితర సౌకర్యాలను అందించాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి బిడ్డకూ ఆరోగ్యకర, సంతోషకర బాల్యాన్ని అందించడమే ప్రధాన ఎజెండాగా అడుగులు వేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు అధికారులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. బాల్య వివాహాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న 19 గృహాలకు 19 మందికి మంజూరుకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. లైసెన్స్ పొందకుండా ఉన్నవారు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో అటువంటివి నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు గ్రామసాయి కమిటీల్లో కన్వీనర్లుగా ఉన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు 40 బాల్య వివాహ కేసులు నమోదవ్వగా వెనువెంటనే స్పందించి నిలుపుదల చేసి, వారికి కౌన్సెలింగు నిర్వహించి వారికి తిరిగి చదువు కొనసాగించడానికి చర్యలు తీసుకున్నారన్నారు. పోక్సో చట్టం కింద ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు 83 కేసులు నమోదయ్యాయని తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఐసిడిఎస్ పీడీ ఎ.శారద, డిసిపిఒ డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ జెడి వై.విశ్వమోహన్‌రెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎన్.జితేందర్‌రెడ్డి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ బి.పాల్‌సతీష్‌కుమార్, సంబంధిత అధికారులు, మిషన్ వాత్సల్య నోడల్ అధికారి ఇ.తులసి, జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు, సిడబ్ల్యుసి సభ్యులు సిహెచ్.రాజేశ్వరరావు, పుచ్చల వెంకటేశ్వరరావు, కెల్లా హైమావతి పాల్గొన్నారు.

రైతులు సంక్షోభంలో ఉంటే ప్రభుత్వానికి పట్టదా

'అన్నదాత పోరు'లో వైసిపి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రైతులు సంక్షోభంలో ఉంటే కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఫైర్ స్టేషన్ సెంటర్లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకు వైసిపి నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి హయాంలో వ్యవసాయం రైతులకు పండగల ఉండేదని, ఆర్‌బికెలను నిర్మించి రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ద్వారా సకాలంలో ఎరువులు పంపిణీ చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారాన్ని వెంటనే అందించాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎలు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసు, నేతలు జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: వైసిపి ఆధ్వర్యాన అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించారు. తొలుత పాత బస్టాండ్‌లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్ర, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, తెల్లం రాజ్యలక్ష్మి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏలూరులో..

నూజివీడు టౌన్: అన్నదాత పోరు కార్యక్రమాన్ని మాజీ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యాన నిర్వహించారు. ద్వారకా ఎస్టేట్స్ బయట పోలీసులు మోహరించి ర్యాలీ, సభలకు అనుమతి లేదని చెప్పారు. దీంతో అక్కడ ఆవరణలోనే నిరసన సభ నిర్వహించారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు అన్నదాత పోరుబాట పట్టామన్నారు. అనంతరం వైసిపి రైతుసంఘం నేతలు ఈలప్రోలు వెంకటసుబ్బయ్య, మరి కొంతమంది రైతు ప్రతినిధులతో కూడిన బృందం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించింది.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దంటూ ఆందోళన



నినదిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో వంతెన వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. అదానీ మీటర్లు వద్దు, పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. గత ఎన్నికల ముందు విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరించడం అన్యాయమని విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజలపై భారం పడేలా విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏ విధంగా బిగిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, ఈ స్మార్ట్ మీటర్లతో బిల్లుల భారం పెరిగిందని అన్నారు. స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చు ప్రజలే భరించాలని, అదానీ కంపెనీకి లాభాలు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తున్నాయని విమర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.12 వేల కోట్లు భారం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు, ఎస్.మహంకాళిరావు, తామా ముత్యాలమ్మ, నగర కార్యదర్శి పంపన రవికుమార్, నేతలు వైఎస్.కనకా రావు, జె.గోపీ, కె.లెనిన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

నగరంలోని పవర్‌పేటలో రాజీవ్ స్నేహ వారధి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆందోళన చేపట్టింది. ఆ బ్రిడ్జి వద్ద మంగళవారం సిపిఎం కార్యకర్తలు పెద్దసంఖ్యలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నిత్యం వేలాది మంది ప్రయాణించే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. పెరిగిన టెక్నాలజీ ఉపయోగించి భూగర్భం నుండి నీరు రాకుండా నియంత్రించే అవకాశం ఉన్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సాధారణ వర్షానికి సైతం బ్రిడ్జి మూతపడడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నిర్వహణ పేరుతో లక్షలాది రూపాయలు ప్రతి సంవత్సరం కార్పొరేషన్ అధికారులు ఖర్చు పెడుతున్నారని, పాలకులు శాశ్వత పరిష్కార మార్గాలు వెతకడం లేదని విమర్శించారు. నాచు పట్టి జారి పడుతుంటే నిస్సహాయంగా చూడటం మినహా అధికారులు చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పివి.రామకృష్ణ, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, ఎ.శ్యామలారాణి, అరుణకుమారి, కారం భాస్కర్, జె.గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఓటర్ల హక్కును హరించే ఎస్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా సదస్సుకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త రవి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదమని, ఓటర్ల హక్కును హరించే ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. మత ప్రాతిపదికన పౌరులను విభజించే బిజెపి విధానాలను ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం కేంద్ర బిజెపికి తొత్తుగా మారడం తగదని అభిప్రాయపడ్డారు. ఓటర్ల నమోదుకు పౌరసత్వంతో ముడిపెట్టరాదని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితా సరి చేయడం, అర్హులకు ఓటు హక్కు కల్పించడం, దొంగ ఓట్లు తొలగించడం వంటి పనులు చేయాల్సిన ఎన్నికల కమిషన్ బీహార్లో ఎన్నికల సందర్భంగా బిజెపి ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించడం కోసం ఎస్ఐఆర్ తీసుకొచ్చిందని విమర్శించారు. ఓటు హక్కుకు ఆధార్, పాన్, రేషన్ తదితర గుర్తింపు కార్డులు చెల్లవని కేవలం పౌరసత్వానికి సంబంధించిన రుజువులు కావాలని అడుగుతూ పౌరసత్వ చట్ట సవరణను (సిఎఎ), జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌సిఆర్) చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డి దారిన అమలు చేయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. దానికి ఎన్నికల కమిషన్ తోడ్పాటు అందించడం బాధాకరమని తెలిపారు. ఈ వైఖరితో కేవలం బీహార్‌లోనే దాదాపు 65 లక్షల ఓట్లను తొలగించారని తెలిపారు. మరోపక్క కర్నాటకలోని మహాదేవపూర్ పార్లమెంట్ స్థానంలో ఒక లక్ష పదివేల దొంగ ఓట్లు ఉన్నాయని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు జీవరత్నం, భాస్కర్, ముత్యాలమ్మ, వెంకట్రావు, సుధారాణి, నాయకులు సూర్యకిరణ్, ఎ.శ్యామలారాణి, ఇస్సాక్, అరుణకుమారి, సుభాషిణి పాల్గొన్నారు.

తహశీల్దార్ వ్యాఖ్యలపై సర్పంచుల ఆగ్రహం

మండల పరిషత్ సమావేశం బహిష్కరణ

మద్దతు పలికి నిరసనలో పాల్గొన్న ఎంపిపి

తహశీల్దార్ దిగి రావడంతో సద్దుమణిగిన వివాదం



మండల పరిషత్ కార్యాలయం వద్ద బైఠాయించిన సర్పంచులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సర్పంచులపై తహశీల్దార్ వ్యాఖ్యలతో ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభసాగా మారింది. సర్పంచులంతా సమావేశాన్ని బహిష్కరించి నిరసన చేపట్టడంతో ఎట్టకేలకు తహశీల్దార్ దిగొచ్చి తన వ్యాఖ్యలపై చింతిస్తున్నట్లు తెలపడంతో సమస్య సద్దుమణిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. తొలుత సమావేశం ప్రశాంతంగా సాగింది. పలువురు అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సమావేశంలో పాల్గొన్న సభ్యులకు వివరించారు. రెవెన్యూ శాఖ విషయంలో సర్పంచులు పలు ప్రశ్నలు సంధిచడంతో తహశీల్దార్ లతీఫ్‌షా అసహనానికి గురయ్యారు. చినకామనపూడి సర్పంచి సిహెచ్.నాంచారయ్య తమ పంచాయతీ పరిధిలోని ఊర చెరువు ఆక్రమణకు గురైందని, సర్వే చేసి ఆక్రమణ తొలగిస్తే చెరువు లోతుగా తవ్వుకుంటామని పిజిఆర్ఎస్ వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, సర్వే చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారన్నారు. అయితే సర్వే చేయకుండానే చేసినట్లుగా పేర్కొంటూ ఫిర్యాదు పరిష్కరించామని, సమస్యను ఇంతటితో ముగిస్తున్నామని తమకు సమాచారం పంపడంలో ఆంతర్యం ఏమిటని తహశీల్దార్‌ను నాంచారయ్య ప్రశ్నించారు. దీనిపై తహశీల్దార్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. కొరగుంటపాలెం సర్పంచి పేరే రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలో భూములు సైతం ఆక్రమణకు గురయ్యాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా తహశీల్దార్ ఒక్కసారిగా అసహనంతో 'మిడిమిడి జ్ఞానంతో సమావేశాలకు రావొద్దని, చట్టాలు, నిబంధనల గురించి తెలుసుకొని మాత్రమే సమావేశాలకు రావాలి' అని వ్యాఖ్యానించడంతో సర్పంచులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. శ్రీహరిపురం సర్పంచి పరసా విశ్వేశ్వరరావు జోక్యం చేసుకుని సర్పంచులను కించపరచడం తగదనగా ఆయనతోనూ తహశీల్దార్ వాగ్వివాదానికి దిగారు. దీంతో తహశీల్దార్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ సైతం సమావేశం బహిష్కరిస్తున్నామని ప్రకటించి మండల పరిషత్ కార్యాలయ ముఖద్వారం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సర్పంచులను అగౌరపరిచే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. జరిగిన ఘటనకు బాధ్యత వహిస్తూ తహశీల్దార్ క్షమాపణ చెప్పాలని ఎంపిపి, సర్పంచులు డిమాండ్ చేశారు. దాదాపు మూడు గంటలపాటు ఈ హై డ్రామా కొనసాగగా ఎట్టకేలకు తహశీల్దార్ దిగొచ్చి జరిగిన ఘటనకు చింతిస్తున్నానని, తన వ్యాఖ్యలను పొరపాటుగా అర్థం చేసుకున్నారని చెప్పడంతో సర్పంచులు, ఎంపిపి, జెడ్‌పిటిసి ఆందోళన విరమించారు.



సర్పంచులకు సర్ది చెబుతున్న తహశీల్దార్

ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వద్దు

సిఎం చంద్రబాబుకు మాజీ ఎంఎల్‌సి అంగర లేఖ

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలోని అధికార టిడిపి అసంతృప్తులతో సతమతమవుతోంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన మధ్య సమన్వయం కొరవడి విబేధాలు పొడసూపిన సంగతి తెలిసిందే. ఇటీవల టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతా రామలక్ష్మిపై ఆ నియోజకవర్గ పరిధిలోని వీరవాసరం మండలానికి చెందిన బిసి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ తిరుగుబావుటా ఎగరేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టిడిపి అధిష్టానం పొరపాటో, లేక స్థానిక రాజకీయాల ప్రభావమోగాని సీనియర్ నేతలు సైతం అసంతృప్తికి గురయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. తాజాగా రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి తనకు వద్దని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ సిఎం చంద్రబాబుకు మంగళవారం లేఖ రాయడమే దీనికి నిదర్శనం. లేఖలోని అంశాలను ఆయన మంగళవారం మీడియాకు విడుదల చేశారు. టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకూ తాను పార్టీలో కష్టపడి పని చేస్తున్నానని తెలిపారు. ఎన్‌టిఆర్ హయాంలో పాలకొల్లు ఎంపిపిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్‌పి వైస్ ఛైర్మన్‌గా పని చేశానని, రెండుసార్లు ఎంఎల్‌సిగా అవకాశం కల్పించారని తెలిపారు. ఎంఎల్‌సిగా ఉన్న సమయంలో ప్రభుత్వ విప్‌గా మూడేళ్లు, రాష్ట్ర శాసనసభ లెజిస్లేటివ్ లైబ్రరీ ఛైర్మన్‌గా ఐదున్నర సంవత్సరాలు అవకాశం దక్కిందన్నారు. ఈ క్రమంలో తాను పార్టీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని, రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు సభ్యుని పదవి మాత్రం వద్దని ఆ లేఖలో పేర్కొన్నారు. ఎంఎల్‌సి స్థాయిలో పని చేసిన నేతకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టినా సముచితంగా ఉండేదని, డైరెక్టర్ పదవి కట్టబెట్టడం జీర్ణించుకోలేకే అంగర పదవిని తిరస్కరించారని ఆయన అనుయాయులు చెబుతున్నారు.

అక్రమంగా తరలించి.. అధిక ధరకు విక్రయించి..!

ఆంధ్రా ఇసుకను తెలంగాణలో అమ్మి సొమ్ము చేసుకుంటున్న వైనం
లారీలు అధిక లోడుతో వెళ్లడంతో రోడ్లు ఛిద్రం
ఒక్క రోజులోనే 16 లారీలను సీజ్ చేసిన పోలీసులు


ఇసుక తరలిస్తున్న లారీలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆంధ్రాలో ఉచిత ఇసుకను తెలంగాణలో అమ్ముకుంటూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మేడిశెట్టివారిపాలెం, అల్లిపల్లి, గురుభట్లగూడెం, చుట్టుపక్కల సరిహద్దు గ్రామాల నుంచి, కొవ్వూరు ఇసుక ర్యాంపుల నుంచి మండలంలోని ఏదో గ్రామం పేరుపై నమోదు చేసి ఇసుకను తెలంగాణకు తరలిస్తున్నారు. టన్ను రూ.650 నుంచి రూ.700 వరకు ఉండే తెలంగాణలో రూ.1200 నుంచి రూ.మూడు వేల వరకు వసూలు చేసి కాసులు చేసుకుంటున్నారు.

ఆంధ్రాలో ఉచిత ఇసుక పథకం తెలంగాణ ఇసుక మాఫియాకు వరంగా మారింది. హైదరాబాద్ వెళ్తే రూ.మూడు వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొవ్వూరు, కుమారదేవం, వాడపల్లి, అరికిరేవుల ర్యాంపుల నుంచి చింతలపూడి మీదుగా తెలంగాణకు రోజుకు 20 నుంచి 30 లారీల వరకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక్కొక్క లారీకి ఇసుకను బట్టి ఇరవై టన్నులకు మైనింగ్‌కు డబ్బులు చెల్లించి అదనంగా మరో 20 టన్నులు ఎటువంటి బిల్లు లేకుండా యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక ర్యాంపుల వద్ద ఉన్న లారీ యజమానులు ట్రాక్టర్ ద్వారా ఒక చోట ఇసుక డంప్ చేసి ఎటువంటి బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితులకు మించి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధిక లోడుతో లారీలు తిరగడడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చింతలపూడి మండలంలో సుమారు 21 లారీలను పోలీసులు పట్టుకున్నారు. ఏలూరు ఆర్‌విఎస్ మైనింగ్ వారు మరో ఐదు లారీలు పట్టుకుని చింతలపూడి ఎఎంసి మార్కెట్ వద్దకు తరలించారు. ఒక్కరోజులోనే 16 ఇసుక లారీలు పోలీసులు పట్టుకున్నారంటే ఏపి నుంచి తెలంగాణకు ఇసుక ఏ విధంగా అక్రమంగా తరలిస్తున్నారో అర్థమవుతుంది. దీనిపై చింతలపూడి సిఐ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా మండలంలో ఏపి సరిహద్దు ప్రాంతాలు మేడిశెట్టివారిపాలెం, గురుభట్లగూడెం నుంచి [illegible] ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలిస్తున్న 16 ఇసుక లారీలను పట్టుకున్నట్లు తెలిపారు. ఆ లారీలను రెవెన్యూ అధికారులకు బైండోవర్ చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏలూరు ఆర్‌విఎస్ మైనింగ్ ఎడి కిషోర్‌ను వివరణ కోరగా తెలంగాణకు ఇసుక సరఫరా చేస్తున్న వారి గురించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, రెండు మూడు రోజుల్లో దీనిపై పూర్తి సమాచారం తెలియజేస్తామని చెప్పారు.

చీటీల పేరుతో మోసగించారని ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


ఆందోళన చేస్తున్న బాధితులు

ఏలూరులోని శాంతినగర్ 13వ రోడ్డుకు చెందిన వేమూరి లక్ష్మీరవిచంద్ర చౌదరి దంపతులు చీటీల పేరుతో మోసం చేశారని వారి ఇంటి ఎదుట పలువురు మంగళవారం ఆందోళన చేశారు. ఆందోళనకారులు తెలిపిన వివరాల ప్రకారం... గత పదేళ్లుగా లిఖిత చిట్ ఫండ్స్ పేరుతో వేమూరి లక్ష్మీ రవిచంద్ర చౌదరి దంపతులు చిట్టీలు కట్టించుకుంటున్నారు. చిట్టీ సొమ్ము కట్టడం పూర్తి అయిపోయినప్పటికీ వారికి సొమ్ము చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సొమ్ము కోసం సంప్రదించగా ఇల్లు అమ్మేసి ఊరి నుంచి వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.ఐదు లక్షల చీటీలు, రూ.పది లక్షల చీటీలు కట్టించుకున్నారని తెలిపారు. సుమారు రూ.ఐదు కోట్ల వరకు చెల్లించాల్సి ఉందన్నారు.

పిఎఐతో పారదర్శక పాలన

జెడ్‌పి ఛైర్పర్సన్ పద్మశ్రీప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా భాగస్వామ్యం కోసం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ వర్క్‌షాపు (పిఎఐ) ఒక ముఖ్యమైన సాధనమని జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా స్థాయిలో మంగళవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. ఈ సూచిక ద్వారా పంచాయతీల పరిపాలన, వనరుల వినియోగం, సేవల అందజేత, సామాజిక–ఆర్థిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు అంచనా వేయనున్నట్లు తెలిపారు. పంచాయతీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా అధికారులను, పంచాయతీ రాజ్ సిబ్బందిని అభినందించారు.

10న పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ శిక్షణ

భీమడోలు :భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరం వేదికగా ఈ నెల పదో తేదీ గురువారం పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శర్మ తెలిపారు. ఒకరోజు పాటు కొనసాగే శిక్షణా తరగతులకు ఎంపిడిఒ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. సమావేశానికి ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ డిజిటల్ ఆపరేటర్లు హాజరవుతారని ఎంపిడిఒ తెలిపారు.

యూరియా పంపిణీపై అవుట్ రీచ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని యనమదల పిఎసిఎస్‌లో మంగళవారం యూరియా పంపిణీపై అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బద్రు నాయక్, ఎడిఎ జి.విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు పాల్గొని యూరియా లభ్యత, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం నూజివీడు మండలంలో 59 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులందరికీ వారి అవసరాలకు తగ్గట్టుగా యూరియా అందిస్తామని తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రతినిత్యం వ్యాయామం చేస్తే మానసిక, శారీరక ఆరోగ్యం కలిగి ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు. మండలంలోని రమణక్కపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌కుమార్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి పట్టణ సీనియర్ నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తెల్లగారపు జ్యోతి, పరిమి సత్యనారాయణ, సాయిల సత్యనారాయణ, రావూరి కృష్ణ, మద్దిపాటి నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, మహంకాళి రాంబాబు, ఆకుమర్తి రామారావు, తూటికుంట దుర్గారావు, తూటికుంట రాము, మిడత పెంటయ్య, షేక్ నజీర్ బుల్లియ్య, చేను ప్రసాద్, కన్నా కృష్ణ, కంచర్ల గణేష్, కోనేటి చంటి, గెడ సుబ్రహ్మణ్యం, నాయుడు శ్రీను పాల్గొన్నారు.

15న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

కలిదిండి :ఈ నెల 15వ తేదీన విజయవాడ లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆ సంఘం (సిఐటియు అనుబంధం) మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. తొలుత ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ అక్బర్ భాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం నాయకులు కటికల శ్రీను, పరస రాజేష్, బండారు కనక లింగేశ్వరరావు, సుంకర హరీష్, బత్తిన సూరిబాబు, జక్కుల మహేష్, పోతురాజు, బాలాజీ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

జీలుగుమిల్లి :రైతులందరూ ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలో తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. మండలంలోని పి.రాజవరంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన శాఖాధికారిని నవీన మణిమాలతో కలిసి రైతు సేవ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న సొసైటీల్లో 60 మెట్రిక్ టన్నుల వరకు యూరియా నిల్వలు ఉన్నాయని, కావాల్సిన వారు వినియోగించుకోవాలని చెప్పారు.

నేరాలు – ఘోరాలు

దానగూడెం ఘటనలో మరో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కైకలూరు దానగూడెంలో ఈ నెల ఐదో తేదీన చోటు చేసుకున్న దళితులపై దాడి ఘటనలో ఇప్పటికే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామని, మంగళవారం సాయంత్రం కైకలూరు సమీపంలో మరో నిందితుడిని అరెస్టు చేశామని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనపాల నాగశివను అరెస్ట్ చేశామని, మరికొంతమందిని అరెస్ట్ చేయాల్సి ఉందని, కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కైకలూరు పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందని, జిల్లావ్యాప్తంగా సెక్షన్ 30 అమలులో ఉందని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

భీమడోలు :మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల వాహనదారులు ఎదుటివారు సైతం ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్న విషయాన్ని గమనించాలని భీమడోలు సిఐ యుజె.విల్సన్ కోరారు. భీమడోలు ఎస్ఐ సుధాకర్‌తో కలిసి సిఐ జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. తనిఖీల్లో పట్టుబడ్డ భీమడోలుకు చెందిన యువకునిపై కేసు నమోదు చేసి ఏలూరు కోర్టుకు హాజరు పరిచామని సిఐ తెలిపారు. విచారణ అనంతరం ఏలూరు ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి నిందితునికి వివిధ సెక్షన్ల కింద 20 రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

అక్రమంగా బోరు వేస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అటవీ ప్రాంతంలో అక్రమంగా బోరు వేస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ టి.సత్యనారాయణ తెలిపారు. ఆయన నూజివీడులో మంగళవారం మాట్లాడుతూ గతంలో నూజివీడు కార్యాలయ పరిధిలో ఉన్న కాట్రేనిపాడు అటవీ ప్రాంతంలో అక్రమంగా బోరు వేస్తున్నారనే సమాచారంతో తెల్లవారుజామున నాలుగు గంటలకు సిబ్బందితో కలిసి వెళ్లి బోరు వేసే వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఇదే విధంగా అక్రమంగా గ్రావెల్ తరలించడం, పైపులైన్ వేయడం, బోరు వేసే సందర్భాల్లో 80 వాహనాలను సీజ్ చేసి రూ.40 లక్షల జరిమానా విధించామన్నారు.

15 నుంచి రణభేరి : యుటిఎఫ్

ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రణభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, జిల్లా కార్యదర్శి పురేటి శ్రీనివాసరావు, దామోదర్, ప్రేమ్‌కుమార్, లక్ష్మణరావు, శేఖర్, కంచర్ల బుచ్చిబాబు, రాజు, రామాంజిబాబు, అవినాష్, శ్రీనివాసరావు, హేమ్లానాయక్, కృష్ణ, చింతలపూడి, టి.నరసాపురం సభ్యులు పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్థానిక మండల కార్యాలయంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ కొయ్యలగూడెం తాలూకా యూనిట్ ఎన్నికలను ఎలక్షన్ ఆఫీసర్ వై.నరేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పి.శ్రీనివాసరావు అధ్యక్షుడిగా, కె.స్వామి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పలువురు వివిధ హోదాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, ఉమెన్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ కుసుమ, జిల్లా సంఘ సభ్యులు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు నాగకిషోర్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రణాళిక

నూజివీడు టౌన్ :పట్టణంలోని వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. వెలుగు ఎపిఎం పచ్చిగళ్ల ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం ప్రణాళిక బద్ధంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్, రోడ్లు, డ్రెయిన్లు, రుణాల అవసరాన్ని, అవకాశాన్ని బట్టి ప్రత్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్ చేయనున్నట్లు చెప్పారు. గ్రామ పురోభివృద్ధి కోసం ప్రతి అంశాన్ని చర్చించి, యాప్ ద్వారా ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. మండలంలో 1900 గ్రూపుల్లో 19 వేల మందికి పైగా ఉన్న మహిళా సభ్యులు లబ్ధి పొందుతారని వివరించారు.

రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - ముసునూరు

కొన్నేళ్ల నుంచి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. మండలంలోని చెక్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ డి.ప్రశాంతి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. చెక్కపల్లి గ్రామంలో 2018–19 సంవత్సర కాలం నుంచి గ్రామ అధికార ప్రభుత్వ అడంగల్, ఆర్ఒ, వన్ బి ఆన్‌లైన్‌లో ఆ గ్రామంలోని రైతుల పట్టా భూమి, చెరువు భూమి అని తప్పుగా నమోదు కావడంతో, రైతులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభకు నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న హాజరయ్యారు. సుమారు 60 మంది రైతులు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సిఫార్సు మేరకే యూరియా వాడాలి

భీమడోలు :రైతులు వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకు మాత్రమే వరి సాగుకు యూరియా వినియోగించాలని, అధిక వాడకం వల్ల పైరుకు నష్టంతో పాటు, ఆర్థిక భారం పెరుగు తుందని భీమడోలు వ్యవసా యాధికారి ఉషారాణి తెలిపారు. భీమడోలు రైతు సేవా సహకార సంఘం ఎరువుల గోదాంను ఆమె మంగళవారం సందర్శించారు. ఎరువుల నిల్వలు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం భీమడోలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ త్వరలోనే రైతులు మూడో కోటా యూరియాను వాడటం ప్రారంభించ నున్నారన్నారు. భీమడోలు మండలంలో యూరియా కొరత లేదని, అవసరానికి మించి ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

ముసునూరు :రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం అభివృద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అక్కినేని చాముండేశ్వరి అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు పంటలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల దిగుబడులు పెరిగి, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. సర్పంచి పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ, సూరేపల్లి మల్లిబాబు, మానరాజు సురేష్, బర్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మద్యంలో రసాయనాలు కలవలేదు'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎటువంటి కల్తీ మద్యం అమ్మకాలు జరగడంలేదని ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఆగస్టు నెలలో జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామంలో 219 మద్యం సీసాలతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు పంపించామని, విచారణలో సదరు మద్యం సీసాలకు మూతలను సరాఫర చేసిన విజయవాడకు చెందిన మరొక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు. కేసులో పట్టుబడిన మద్యంలో ఎటువంటి వేరే రసాయనిక పదార్థాలు కలపలేదని, కొంత నీటిని కలిపారని కాకినాడ గవర్నమెంట్ రీజనల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ల్యాబోరేటరీ వారు నివేదిక అందించారని తెలిపారు.

పేరు మార్పు / సవరణ

నేను అల్లూరి రాజీవ్ S/o అల్లూరి సత్యనారాయణ రాజు, నివాసం : డోర్ నెం. 2-238/2, నారీన్ హోమ్స్, గాన్డిస్‌నెస్ట్, ఫ్లాట్‌నెం. 202, సి, 3వ ఫ్లోర్, వేంపాడు రోడ్డు, చినామీరం రూరల్, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా. ప్రస్తుతం నా కుమారుడి ఆధార్‌కార్డులో **అల్లూరి ప్రనీత్‌వర్మ S/o అల్లూరి రాజీవ్** అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు పుట్టినతేది సర్టిఫికెట్ ప్రకారం నా కుమారుడి పేరు **అల్లూరి ప్రణవ్ వర్మ S/o అల్లూరి రాజీవ్** (ALLURI PRANAV VARMA S/o ALLURI RAJEEV)గా మార్పు చేయుట జరిగినది. కావున నేటి నుండి నా కుమారుడి పేరు **అల్లూరి ప్రణవ్ వర్మ**గా పిలవబడును. ఆధార్‌లో మార్పు కొరకు

వివాదాలు లేని భూములను సేకరించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురవుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిమిత్తం భూమికి భూమి సేకరణలో భాగంగా ఎటువంటి వివాదాలు లేని భూములను సేకరించాలని చింతూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించి మండలంలోని స్వర్ణవారిగూడెం పంచాయతీ పరిధిలో పలు భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కూనవరం మండలంలోని పలు గ్రామాలు పోలవరం ప్రాజెక్టు ముంపులో పడుతున్నందున జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో మూడు వేల ఎకరాల వరకు భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గిరిజనేతరుల సాగులో ఉండి, ఎటువంటి వివాదాలు లేని జిరాయితీ భూములను తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలవ్యాప్తంగా వెయ్యి ఎకరాల వరకు భూమిని సేకరించినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, సర్వేయర్ వెంకటరమణ, విఆర్ఒ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ నీరు చేరేలా సహకరించాలి

ముసునూరు :చివరి ఆయకట్టు వరకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీరు చేరేవరకూ రైతులు సహకరించాలని వేంపాడు మేజర్ డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ కోరారు. వేంపాడు మేజర్ పరిధిలోని చాట్రాయి మండలం రామచంద్రపురం గ్రామం వద్ద ఉన్న 117 రెగ్యులేటర్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా కూడా రంధ్రాలు పెట్టకుండా చివర ఆయకట్టు వరకు నీరు వెళ్లే విధంగా రైతులు సహకరించాలని కోరారు. ప్రస్తుతం నూజివీడు మేజర్‌కు 750 క్యూసెక్కులు, వేంపాడు మేజర్‌కు 750 క్యూసెక్కుల నీరు వేంపాడు మేజర్ కాలువ పరిధిలో పారుదల అవుతున్నాయని చెప్పారు. ఈ నెల 25వ తేదీ వరకు నీరు వస్తుందని, మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులందరూ చెరువులు నింపుకోవాలని సూచించారు. ఆయనతో పాటు రైతు రాపర్ల శివరామకృష్ణ, తదితరులు ఉన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్ష పదవి కేటాయించాలి

పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరామమూర్తి

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి జిల్లా అధ్యక్ష పదవి ఆర్యవైశ్య సామాజిక తరగతికి చెందిన తనకే కేటాయించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి అన్నారు. కె.జగ్గవరంలో ఆయన నివాసం వద్ద టిడిపి మండలాధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ అధ్యక్షతన మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి అంకితభావంతో క్రమశిక్షణతో పార్టీకి సేవలందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. టిడిపిలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ, నామినేటెడ్ పదవులు చేపట్టి పార్టీకి మంచి పేరు తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. టిడిపి జిల్లా అధ్యక్ష పదవి తనకు కేటాయిస్తే క్రమశిక్షణతో, త్రికరశుద్ధితో పని చేస్తానన్నారు. ఇప్పటి వరకు తను పార్టీకి చేసిన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం తనకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని లేదా ఏదైనా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పది కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, కేతవరం ఉప సర్పంచి భీమవరపు జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

సిఎం సహాయ నిధి అనారోగ్య బాధితులకు గొప్ప వరమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీ రామమూర్తి అన్నారు. మండలంలోని కె.జగ్గవరంలో ఇటీవల అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న ఎపిగుంట గ్రామానికి చెందిన కోరుకొండ వెంకట భద్రానికి సిఎం సహాయ నిధి రూ.70 వేల చెక్కును మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనారోగ్య బాధితులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎస్‌పిఎల్ ఎన్నికలు

ద్వారకాతిరుమల :తిరమలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి నాయకులు, ఉప నాయకుల ఎన్నికను ప్రజాస్వామ్య పద్ధతిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శేషుకుమారి మాట్లాడుతూ ఇలాంటి ఎన్నికలు నిర్వహించటం వల్ల విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని హేమలత ఎన్నికల నిర్వహణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించి అవగాహన కల్పించినారు. స్కూల్ ఎస్‌పిఎల్‌గా ఎనిమిది మంది పోటీ చేయగా కె.చంటిబాబు, డిప్యూటీ ఎస్‌పిఎల్‌గా దేవి ప్రసన్నలక్ష్మి ఎన్నికయ్యారు. వీరికి ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఫణికుమార్, రాజేశ్వరమ్మ మధు, శ్రీదేవి, ఆదినారాయణ పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతలపూడి

కొణిచర్ల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం తోచిలక గ్రామంలో రూ.3.75 కోట్లతో నిర్మించనున్న ఆరు కిలోమీటర్ల బిటి రోడ్డు పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. మొదటి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.